పుకార్లు నమ్మొద్దు.. పార్టీ మారడం లేదు

జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, మార్చి 3: కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న పుకార్లను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఖండించారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజులుగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తాను రాజకీయంలో అడుగుపెట్టినప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, 2014 శాసన సభ ఎన్నికల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడినా బీఆర్ఎస్ వెంటే ఉన్నానన్నారు. 2018, 2023 శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన గెలుపొందినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

హనుమాన్ ఆలయంలో హోమం

మనూరు, మార్చి 3: మండల పరిధిలోని మాయికోడ్ హనుమాన్ ఆలయంలో ఆదివారం హోమం నిర్వహించారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి ఆదివారం హోమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కుటుంబాల వారీగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని వివేకనంద సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన హోమంలో గ్రామానికి చెందిన సాయిలు కుటుంబ సభ్యులు పాల్గొన్నట్లు తెలిపారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజాల అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు భీమన్న, శ్రీకాంత్, రమేశ్, సంగమేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

భూపాల్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

సిర్గాపూర్, మార్చి 3: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం స్థానానికి బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డికి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావుపాటిల్, నాయకులు యాదవరావు, నారాయణ ఆదివారం పార్టీ అధినేతలను కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో భూపాల్‌రెడ్డి ఓటమి చెందారన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి నియోజవర్గంలో భూపాల్‌రెడ్డికి మంచి పట్టు ఉన్నదని చెప్పారు. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో తమ పార్టీకి ఒరిగే నష్టమేమి లేదన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజవర్గంలో బీజేపీకి అంత ప్రభావం ఉండదని, భూపాల్‌రెడ్డికి టికెట్ ఇస్తే మంచి మెజారిటీ వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అధిష్టానం బాగా ఆలోచించి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా భూపాల్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షలు విరాళం

రాయికోడ్, మార్చి 3: మండల కేంద్రమైన రాయికోడ్‌లో హనుమంతుని ఆలయ నిర్మాణానికి ఆదివారం మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అబేద్‌మియా, అయన కుమారుడు షేక్ సయ్యద్‌మియా రూ.2 లక్షల విరాళం నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాలను గౌరవించాలన్నారు. ఆధ్యాత్మిక సేవలో ముందుంటానని, ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. మండలంలో ఎవరైనా మందిరాలు, మసీద్‌లు, చర్చిల నిర్మాణం చేపడితే తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం అందించిన షేక్ అబేద్‌మియ, వారి కుటుంబ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో గ్రామ పెద్దలు విఠల్, మణెయ్య, తుకారం, శివకుమార్, రావి, నవీన్ ఉన్నారు.

విరాళం అందిస్తున్న కోఆప్షన్ సభ్యుడు షేక్ బేద్‌మియా

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

పుల్కల్, మార్చి 3: పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని మాజీ సర్పంచ్ రవీందర్ రావు పాటిల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయిపహాడ్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అందోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాణిక్యం, గ్రామ శాఖ అధ్యక్షుడు హైమద్, యూత్ అధ్యక్షుడు నవీన్, మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశం పాల్గొన్నారు.

రాయిపహాడ్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

జహీరాబాద్‌లో గుంతలమయంగా రోడ్లు

జహీరాబాద్, మార్చి 3: ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి వేసిన బీటీ, సీసీ రోడ్లను కేబుల్ వైర్లు వేసేందుకు తవ్వడంతో రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట కేబుల్ వైర్లు వేసేందుకు యంత్రాలతో తవ్వకాలు చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు సీసీ రోడ్డు వేయకుండా బూస్టు వేసి మరమ్మతులు చేస్తున్నారు. దీంతో రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్, పోస్టాఫీసు, అంబేద్కర్ విగ్రహం పక్కన రోడ్లపై తవ్వకాలు చేపట్టి సరైన మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లపై గుంతలు అలాగే ఉండిపోయాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడు.

జహీరాబాద్ పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్ భవనం ఎదుట తవ్విన బీటీ రోడ్డు

భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన



కంది : భూ సమస్యలపై ఎంక్వైరీ చేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

గుమ్మడిదల : దోమడుగులో భూసమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ గంగాభవానీ

కంది, మార్చి 3: ధరణి భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఆదివారం కంది మండలంలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. భూ సమస్యలపై ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న వారి భూములను పరిశీలించారు. ఎద్దుమైలారం, చిద్రుప్ప, ఉత్తర్‌పల్లి గ్రామాల్లో అధికారులు పర్యటించి దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎద్దుమైలారంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీపీ సరళాపుల్లారెడ్డితో కలిసి పరిష్కారం కాని భూములను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఉప తహసీల్దార్, సర్వేయర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుమ్మడిదల, మార్చి 3: భూసమస్యల పరిష్కారానికే గ్రామాల్లో ధరణి పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ గంగాభవాని తెలిపారు. ఆదివారం మండలంలోని దోమడుగులో తహసీల్దార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

న్యాల్‌కల్, మార్చి 3: ధరణిలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తహసీల్దార్ భానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని టేకూర్, తాట్‌పల్లి, హుస్సేల్లి, మామిడ్గి, మెటల్‌కుంట, గణేశ్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు.

ధరణిలో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్న రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 9వరకు మండలంలోని అన్ని గ్రామా ల్లో పర్యటించి భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గయ్య, సీనియర్ అసిస్టెంట్ శివకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చుక్కల మందుకు చక్కటి స్పందన

- విజయవంతంగా పల్స్ పోలియో
- ఐదేండ్లలోపు పిల్లలకు పంపిణీ

జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైంది. గ్రామాలు, పట్టణాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఐదేండ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజంలో పోలియో మహమ్మారిని రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం 5వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆదివారం చుక్కల మందు వేసుకోని పిల్లల కోసం వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని, తల్లిదండ్రులు తప్పక వినియోగించుకోవాలని కోరారు.

- సంగారెడ్డి న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 3

నారాయణఖేడ్ : చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి

బొల్లారం: చుక్కల మందు వేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

హత్నూర : పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

జిన్నారం : శివనగర్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్

రామచంద్రాపురం : ఆర్సీపురం పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం : భారతీనగర్ ఎల్ఐజీలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

గంజాయి స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

మునిపల్లి, మార్చి 3: గుట్టుగా సాగుతున్న గంజాయి రవాణాపై ప్రోహిబిషన్, ఎక్సైజ్, పోలీస్ శాఖలు నిఘా పెట్టినా అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. శనివారం రాత్రి మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామ శివారులోని డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద ప్రోబిషెన్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ నాజీర్‌పాషా ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. జహీరాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు బైక్‌పై వెళ్తున్న బురుజు జగన్ అనే వ్యక్తి 2.19కిలోల ఎండు గంజాయిని రవాణా చేస్తూ పట్టుపడ్డాడు. నిందితుడిని విచారణ నిమిత్తం సంగారెడ్డి ఎక్సైజ్ కార్యాలయానికి, ఆదివారం రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ పోలీసులు

హైదరాబాద్‌లో కిడ్నాప్.. జహీరాబాద్‌లో సేఫ్

- సురక్షితంగా చిన్నారి
- పోలీసుల అదుపులో నిందితురాలు

జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి

జహీరాబాద్, మార్చి 3: హైదరాబాద్‌లో 8 నెలల పాపను కిడ్నాప్ చేసి ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి మహారాష్ట్ర, కర్ణాటక వైపు వెళ్తున్న బస్సులో వస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నామని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం జహీరాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ పాత బస్తీలోని మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ నర్సింగ్ హోం హాస్పిటల్‌లో 8 నెలల పాపను కిడ్నాప్ చేసినట్లు తెలిపారు.

నుసిరత్ షాజహాన్ బేగం పాపను కిడ్నాప్ చేసి బస్సులో వస్తున్న ట్లు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం అందడంతో అప్రమత్తయ్యారు. డీఎస్పీ ఆదేశాల మేరకు జహీరాబాద్ బస్టాండ్‌లో కర్ణాటక, మహారాష్ట్ర వైపు వెళ్తున్న బస్సులను తనిఖీ చేసినట్లు తెలిపారు. నుసిరత్ షాజహాన్ బేగం వద్ద పాప ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వెంటనే మాదన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. మాదన్నపేట పోలీసులు, పాప తల్లిదండ్రులు జహీరాబాద్‌కు రావడంతో వారికి పాపను అప్పగించారు. నిందితురాలని అదుపులోకి తీసుకున్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బొల్లారం, మార్చి 3: మున్సిపల్ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజున స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



భక్తుల సమక్షంలో శ్రీవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

నారాయణఖేడ్, మార్చి 3: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 45ఏండ్లుగా పేద పిల్లలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సేవలకు గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉన్నదన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించి కేవలం శాఖాపరమైన విధులు మాత్రమే అప్పగించాలని, ఉద్యోగ భద్రత కల్పిచాలని కోరారు.

ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

బొల్లారం, మార్చి 3: ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తు గడువును పొడిగిస్తూ తాజాగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు బొల్లారం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు, 7వ తరగతి నుంచి 10 వరకు ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కాల కీర్తన

సిర్గాపూర్, మార్చి 3: మండల పరిధిలోని కడ్పల్ దాసాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అఖండ హరినామ సప్తాహంలో భాగంగా అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ భారతీమహారాజ్ కాలా కీర్తన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆధ్మాత్మిక విషయాలను వివరించారు. గ్రామస్తులు నిండు కలశాలతో గ్రామంలో ఊరేగింపుతో గోపాల కాల దిండి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఐగా నయీముద్దీన్

న్యాల్‌కల్, మార్చి 3 : జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నయీముద్దీన్ నియమితులయ్యారు. ఆదివారం మండలంలోని హద్నూర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీపై వచ్చిన నవీన్‌కుమార్ ఐజీ కార్యాయానికి బదిలీ అయ్యారు.

ఆయన స్థానంలో బొల్లారం నుంచి రూరల్ సీఐగా నయీ ముద్దీన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రత పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఇరుముడితో శ్రీశైలానికి..

ఝరాసంగం, మార్చి 3: మండలంలోని గ్రామాల్లోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. కుప్పనగర్ గుబ్బడి సంగమేశ్వరాలయం, జీర్లపల్లి గ్రామంలోని శంభు మహాదేవ మందిరంలో 45రోజుల పాటు దీక్ష చేసిన శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి బయలుదేరారు. ఆయా గ్రామాల్లో మహిళా భక్తులు మంగళహారతులతో సాగనంపారు.

జిన్నారం నుంచి..

జిన్నారం, మార్చి 3: ఇరుముడితో శివస్వాములు మాదారం గ్రామం నుంచి శ్రీశైలానికి ఆదివారం బయలుదేరారు. గురుస్వామి సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సుమారు ముప్పై మంది స్వాములు శ్రీశైలయాత్ర చేపట్టారు. మండలకాలం దీక్షలు చేపట్టిన శివస్వాములు జ్యోతి ఇరుముడితో మొక్కులు సమర్పించేందుకు బయులుదేరగా గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. శ్రీశైల యాత్ర సందర్భంగా గ్రామంలో శివనామ స్మరణ మార్మోగింది. యాత్రకు బయలుదేరిన వారిలో మల్లేశ్, బల్బీర్‌సింగ్, భగవాన్ సింగ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జిన్నారం : ఇరుముడితో శ్రీశైల యాత్రకు బయలుదేరుతున్న శివస్వాములు

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

పటాన్‌చెరు, మార్చి 3: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎండీఆర్ ఫౌండేషన్ కోఫౌండర్, బీఆర్ఎస్ నాయకుడు పృథ్వీరాజ్ ఆదివారం పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పెద్దచెరువు, జిన్నారం మండలంలోని బొంతపల్లి అర్బన్ ఫారెస్టు, గుమ్మడిదల మండలంలోని అడవిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రకృతి వనరులు చాలా ఉన్నాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. బొంతపల్లి ఫారెస్టు 4,343 ఎకరాల్లో ఉన్నదని, దీంతో అర్బన్ ప్రాంతానికి ప్రాణవాయువు అందుతుందన్నారు. ఈ అడవుల్లో వన్యప్రాణులు భారీ సంఖ్యలో ఉన్నాయని, వాటిని సంరక్షించుందుకు ప్రయత్నిస్తామన్నారు. వేసవిలో వన్యప్రాణుల తాగునీటి కోసం ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండీఆర్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బొంతపల్లి అటవీ ప్రాంతంలో ఎండీఆర్ యువసేన సభ్యులు